వాహనదారులకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు


ఇరుకు రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

లొల్ల గ్రామం సమీపంలోని ముక్తేశ్వరం కాలువలో జరుగుతున్న సైఫాన్ నిర్మాణ పనులు నేపథ్యంలో ఆర్అండ్‌బి రోడ్డు పూర్తిగా తొలగించడం వాహనాలను ఆత్రేయపురం రేవు మీదుగా లొల్ల మీదుగా ట్రాఫిక్ ను మళ్ళించారు. దీంతో ఈ రోడ్డులో ఉన్న కల్వర్టు చిన్నదిగా ఉండటతో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వెళ్లే బస్సులు కూడా ఈ మార్గంలోని వెళ్లడంతో శనివారం వెంకన్న ఆలయానికి వచ్చే యాత్రికులతో రోడ్డు రద్దీగా ఉండడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహన దారులు నాన్న ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు రెండు గంటల పైనే ట్రాఫిక్ జామ్ అయింది.

వదలని ప్లాస్టిక్ భూతం

- పంట కాలువలు, డ్రెయినేజీలు, రోడ్ల వెంబడి దర్శనమిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- ప్లాస్టిక్ ఉత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థాన లో భారత్
- నిషేధం మాటు ను కొనసాగుతున్న వైనం


ద్రాక్షారామం భీమేశ్వరం ఆలయం వెనక ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆధునిక మానవుడు అధికంగా ఉపయోగిస్తున్న వస్తువుల్లో ప్లాస్టిక్ మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ఉదయం లేచినప్పుడు వాడే టూత్ పేస్ట్, బ్రష్ దగ్గర నుంచి తాగే వాటర్ బాటిల్, మార్కెట్కు తీసుకువెళ్లే సంచులు, టిఫిన్ తెచ్చుకునే పొట్లాలు, ఫంక్షన్లకు వెళ్లినప్పుడు ఉపయోగించే ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, మందులు వాటికి వాడే కవర్లు, మద్యం బాటిల్లు, ఇలా ప్లాస్టిక్ భూతం మానవులను తన కబంధ హస్తాల్లో బంధించింది. చిన్నపిల్లలు తాగే పాలసీసాల దగ్గర నుంచి వ్యవసాయానికి వాడే ఎరువులు పురుగుమందులు సైతం ప్లాస్టిక్ డబ్బాలోనే వస్తున్నాయి. ఇక మానవులు అధికంగా ప్లాస్టిక్ పై ఆధారపడడానికి ఇది చౌకగా దొరకడంతో పాటు, ప్లాస్టిక్ బిందెలు, ప్లాస్టిక్ వస్తువులు క్యాన్లు వంటివి తేలికగా ఉంటాయి. అందుచేత దీనిని విరివిగా ఉపయోగిస్తున్నారు. గత వందేళ్లుగా ప్లాస్టిక్ రోజురోజుకు విశ్వవ్యాప్తంగా తయారై మానవ మనుగడను ప్రశ్నార్ధకంగా మార్చింది. ప్లాస్టిక్ వస్తువులు ప్లాస్టిక్ కోటెడ్ పదార్ధాలు, ప్లాస్టిక్ కవర్లలో నిలువ ఉంచిన ఆహార పదార్ధాల వల్ల కేన్సర్ కారకంగా మారిందని నిపుణులు తెలుపుతున్నారు.

ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో ప్లాస్టిక్ ఉత్పత్తి

ప్లాస్టిక్ ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో భారతదేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో కొనసాగుతోంది. ప్రతి ఏడాది 3.5 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి భారత్ తయారుచేస్తుంది. ప్లాస్టిక్ ముప్పును గమనించిన అతి చిన్న దేశమైన బంగ్లాదేశ్ 2002లో దీనిని నిషేధించింది. రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వల్ల ఇటు పంట కాలువలు, డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. తద్వారా వర్షాకాలంలో పంట పొలాల్లో వృథాగా ఉన్న నీరు కిందకు దగ్గర పంట చేలు ముంపు గురవుతున్నాయి. ఇక రోడ్ల పైన ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయడంతో పశువులు తదితర జీవరాశి ఈ ప్లాస్టిక్కు ఆహార పదార్థాలతో కలిసి వాటికి తేలకుండా తింటున్నాయి. దీంతో తీవ్రమైన వ్యాధులకు గురవుతున్నాయి. మరోవైపు మానవులు ఉపయోగించే పంటపొలాల్లో ఈ ప్లాస్టిక్ ప్రవేశించడం వల్ల పంటల్లో వచ్చే గింజలు కాయలను ప్లాస్టిక్ వ్యర్థాలు తన ఉనికిని చాటుతూ తిరిగి మానవుని శరీరంలోకి ప్రవేశిస్తు న్నాయి. ఇది క్యాన్సర్ కు దారితీస్తుందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో అనేక కాలువలు డ్రెయిన్లు నిండిపోవడంతో ఇటీవల ముంబై వంటి నగరాలు తీవ్రమైన జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు నెలలో కలవడానికి వందల సంవత్సరాలు సమయం పడుతుంది ఇదే టైంలో పేపర్ ప్లేట్లు పేపర్ తో తయారు చేసిన కవర్ల వల్ల మనం ప్లాస్టిక్ నారకట్టవచ్చు పేపర్ ప్లేట్లు కేవలం వారం పది రోజుల్లో మట్టిలో కలిసిపోతాయి. అదే ప్లాస్టిక్ పదార్థాలు మట్టిలో కలిసి జీర్ణమయ్యేందుకు వందల ఏళ్ళ పడుతుంది. రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, జీవరాశి పూర్తిగా దెబ్బతింటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్లాస్టిక్ నిరోధించాలని అనే సూచనలు చేసింది.

నిషేధం మాటున కొనసాగుతున్న ప్లాస్టిక్

భారతదేశంలోనూ ప్లాస్టిక్ ను 2019లో నిషేధించారు. అయితే దీనికి ప్రజల నుంచి ఫ్యాక్టరీ నుండి అంతగా స్పందన లేకపోవడంతో నిషేధం మోటున ప్లాస్టిక్ కొనసాగుతోంది. మళ్లీ దీనిపై ప్రభుత్వం పవన్ ఆలోచించి 2022లో ప్లాస్టిక్కు నిషేధం కఠినంగా అమలు చేస్తున్నామని ప్రకటించారు. అయినప్పటికీ ఫలితం కనపడటం లేదు. క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ టీ కప్పులు, వివాహ సమయంలోను వాడే భోజనం ప్లేట్లు, కూల్ డ్రింకులు సైతం ప్లాస్టిక్ లోనే తయారవుతున్నాయి. చట్టాలు చేసినప్పటికీ ప్రభుత్వం వాటిని చిత్తశుద్ధితో అమలు చేయకపోవడంతో ప్లాస్టిక్ చాప కింద నీళ్లలా తన ఉనికిని కాపాడుకుంటుంది. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో మన ముందు తరాలకి సరైన పర్యావరణం, ఆరోగ్యం, కల్తీ లేని మంచినీరు అందించడం అసాధ్యం అవుతుంది. ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని, తయారీదారులకు సరైన సూచనలు ఇవ్వాలని, ప్లాస్టిక్ వస్తువులు స్థానంలో పేపర్ ప్లేట్లు, సులువుగా విచ్ఛిన్నమయ్యే వెదురుతో చేసిన పరికరాలను ఉపయోగించాలని, చేతి సంచలనం సైతం నారతో చేసిన వాటిని ప్రోత్సహించాలని, వాటి వినియోగానికి ప్రభుత్వం ప్రోత్సాహం చేయాలని, ప్లాస్టిక్ ను గ్రామస్థాయి నుండి కాకుండా, జాతీయస్థాయిలో నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలను నిషేధించాలని, ఇదే సమయంలో ప్లాస్టిక్ ని రీసైకిల్ చేసే విధానం అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు ప్రజలు, పర్యావరణ వేత్తలు, వైద్యులు సెలవిస్తున్నారు.


ద్రాక్షారామంలోని పంట కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు


నగరం లో కౌవులు రైతుల సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట నాయకులు బలరాం

కౌలు రైతుకూ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం డిమాండ్

ప్రజాశక్తి-మామిడికుదురు

అన్నదాత సుఖీభవ ప్రతి కౌలు రైతుకు వర్తింపచేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నగరం మార్కెట్ యార్డ్ వద్ద కౌలు రైతుల సమావేశం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి 70 మంది కౌలు రైతులే వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారనారు. గత ప్రభుత్వం భూయజమాని సంతకం పెడితేనే కౌలు గుర్తింపు కార్డులు ఇస్తామని నిబంధన విధించారని. దానితో చాలా తక్కువ మందికి కార్డులు వచ్చాయి. ఫలితంగా పంట రుణాలు, రైతు భరోసా, నష్ట పరిహారాలు, పంటల భీమా అన్నీ కౌలు రైతులకు దక్కడం లేదు. భూమిలేని ఒసి కౌలు రైతులకు రైతు భరోసా కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదు. కానీ ఆనాడు ప్రతిపక్షంలో ఉండి నేడు అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన కూటమి భూ యజమాని సంతకం తొలగిస్తామని, కౌలు రైతులకు కులాలు ఏమిటి అని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముసాయిదా చట్టం తీసుకొచ్చారు. కానీ అమల్లోకి రావడం లేదు. గతీ వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించే కూటమి ప్రభుత్వం వైసిపి చేసిన చట్టాన్ని అమలు చేస్తున్నారు. మాటల్లో పాత ప్రభుత్వాన్ని విమర్శిస్తారు, ఆచరణలో ఆ ప్రభుత్వం చేసిన చట్టాన్ని అమలు చేయడం కొంచెం వింతగానే ఉందని ఆయన వాపోయారు కేంద్రం ఇస్తున్నటువంటి రూ.6 వేలు కౌలు రైతులకు ఇవ్వటం లేదన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూయజమానులకు అన్నదాతా సుఖీభవ ఇచ్చినా కౌలు రైతులకు కూడా ఇస్తామని చెప్పారు. కాని గత సంవత్సరం అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పుల భారంతో ఆత్మ హత్యలు కూడా చేసుకుం టున్నారు. కాబట్టి ప్రభుత్వం ప్రతి కౌలు రైతును గుర్తించి అన్నదాత సుఖీభవ రూ.20వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కారం చేయాలని జూన్ 11న బుధవారం చలో విజయవాడ మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రి నుండి వ్యవసాయ శాఖ కమిషన్ ఆఫీస్ వరకు ప్రదర్శనంగా వెళ్లి వినతి పత్రం ఇవ్వాలని ఈ కార్యక్రమంలో కౌలు రైతులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం చలో విజయవాడ కరపత్రాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్, మాజీ ఉపాధ్యక్షులు కె సత్యనారాయణ, కౌలు రైతులు తాటికాయల ఉదయ భాస్కర్, రాంబాబు, సత్యనారాయణ, పెయ్యల సత్య నారాయణ, గుత్తాల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈదరాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మామిడికుదురు

ఈదరాడ పంచాయతీ వద్ద తాటిపాక మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపిపి కుసుమ వనజ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి మెడ్ యునైటెడ్ ఆసుపత్రి వైద్యనిపుణులు వైద్య పరీక్షలు చేశారు. 10 సంవత్సరాల ప్రతినిధులు గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ సేవలందించి ప్రజల అభిమానాలు పొందుచున్నారన్నారు.



సాయం అందిస్తున్న కుంచే రమణారావు

అగ్ని ప్రమాద బాధితులకు గుడ్‌సీడ్ సాయం

ప్రజాశక్తి - అంబాజీపేట

వాకలగరువు గ్రామం బుల్లియ్య కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమై ముత్తాబత్తుల వీర వెంకట సత్యనారాయణ, దాకే వెంకటరావు కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులు అయ్యారు. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు శనివారం సాయం అందించారు. బాధిత కుటుంబాలకు బియ్యం,వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, దుస్తులను అందజేశారు. సాయం అందించిన రమణారావుకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల దుర్గారావు, సాపేరాము, మందపాటి బాలకృష్ణ, నక్కా సత్యనారాయణ, పాస్టర్ జాన్సన్ మరియు ఫౌండేషన్ సభ్యులు పందిరి సుబ్బరాజు,గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్,పరమట రాజేష్, నూకపెయ్యి మనోజ్ కుమార్, గణేష్ , విప్పర్తి రమేష్,బల్లా చినరాజా, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పామాయిల్, రసాయనాలతో నకిలీ నెయ్యి తయారుచేసిన భోలేబాబా డెయిరీ

వెబ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయాలి

- ఉపాధ్యాయుల ధర్నా
- ఎస్‌జిటిలకు మాన్యువల్‌గా కౌన్సిలింగ్ చేయాలి


మామిడికుదురులో ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - మామిడికుదురు

వెబ్ కౌన్సెలింగ్ రద్దుచేసి, ఎస్‌జిటిలకు మ్యాన్యువల్‌గా కౌన్సిలింగ్ జరపాలని డిమాండ్ చేస్తూ మామిడికుదురు మండల రిసోర్స్ సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తరపున శనివారం ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు హాజరై ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నుంచి పెద్దిరాజు, జి.నాగ ప్రసాద్, పిఆర్‌టియు నుంచి వై.పల్లంరాజు, వైవి.సత్యనారాయణ, ఆప్తా నుంచి షబ్బీర్ హుస్సేన్, టిఆర్‌కె.గణపతి, అరవ సుబ్రహ్మణ్యం, ఎ.సత్తిబాబు వివిధ సంఘాలకు చెందిన సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కొత్తపేట:** ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో ఎస్‌జిటిలకు మాన్యువల్ బదిలీ కౌన్సిలింగ్‌కు అంగీకరించి, ఇప్పుడు వెబ్ ఆప్షన్స్ ఇవ్వమని బలవంతపెడుతున్న అధికారుల తీరును ఖండిస్తూ వెబ్ కౌన్సిలింగ్‌ను బహిష్కరిస్తున్నామని ఉపాధ్యాయులు అన్నారు. ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా వెబ్ ఆప్షన్ల ప్రక్రియను బహిష్కరించాలని స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు అలాగే 8న జరుగు కాకినాడ డిఇఒ కార్యాలయం వద్ద జరుగు నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కొత్తపేట ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వై.మురళి, బి.శేషగిరి రావు, టి.విజయకృష్ణ, ఎ.రామచంద్ర ప్రసాద్, జి.రాంకుమార్, బి.నారాయణ, పి.భాస్కర శాస్త్రి, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ముమ్మిడివరం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాశాఖ కార్యదర్శి సమక్షంలో జరిగిన చర్చల్లో ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మెన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే ఒప్పందాలను ఉల్లంఘించి వెబ్ కౌన్సెలింగ్ కి అదేశాలును ఉపసంహరించుకోవాలని ఎంఇఒ ఉదయ భాస్కర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.హిమబిందు, సిహెచ్.బైరవస్వామి, ఆర్.నాగార్జున, ఎంవి. రాంబాబు, కె.ఉమా మహేశ్వరరావు, ఆర్‌బివి.రమణ, కె.రాము, కెవిఎస్.నారాయణ, కెఎస్. నాగరాజు, యు.దశరథ రామయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట లో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు


ముమ్మిడివరంలో వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

యాత్రికుల సౌకర్యాలకే ప్రాధాన్యత

వాడపల్లి వెంకన్న ఆలయ డిసి నల్లం సూర్యచక్రధరరావు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటే శ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే యాత్రికుల కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ప్రాధాన్యతకల్పిస్తున్నట్లు ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఆలయ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎండవేడికి యాత్రికులు ఇబ్బందులు పడకుండా ఆలయం మాడవీధులలో పెండల్స్ ఏర్పాటుతోపాటు కూలర్లు ఏర్పాటు చేసినట్లు, అలాగే చిన్న పిల్లలకు పాలు, క్యూలైన్లో యాత్రికులకు మజ్జిగ, చల్లటి తాగునీరు అందజేయడంతో పాటు బిస్కెట్లు సిబ్బంది పంపిణీ చేస్తున్నారన్నారు. యాత్రికులు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ చేస్తున్నట్లు చెప్పారు. క్యూలైన్లో యాత్రికులు ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రూ.60 లక్షలతో శ్రీరామ నగర్ సమీపంలోని నూతన పార్కింగ్ ప్రహరి నిర్మించి పార్కింగ్‌ను తీర్చిదిద్దామన్నారు. శ్రీనివాస ప్రాంగణంలో యాత్రికులు విశ్రాంతి తీసుకునేందుకు 50 రూములు నిర్మించేందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. రూ.1. 30 కోట్లతో డార్మెంటరీలు నిర్మించేందుకు ప్రతిపాదన రూపొందించి ఉన్నత అధికారులకు నివేదించమన్నారు. సిఎస్ఆర్ నిధులతో సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యాత్రికులకు ఉచిత రవాణా మేరకు త్వరలోనే బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి యాత్రికులు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రతి శనివారం రూ.30 వేలు పైబడి యాత్రికులు అన్నదానాన్ని స్వీకరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రసాద్ పథకం నిధులు మంజూ చేసేందుకు స్థానిక ఎంఎల్ఎ కృషి చేస్తున్నారని ఆ నిధులు మంజూరు అయితే పూర్తిస్థాయిలో యాత్రికులకు సౌకర్యాలు అందుతాయి. రోజురోజుకి యాత్రికుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వారికి అనుగుణగా యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నట్లు డిసి తెలిపారు. ఈ సమావేశంలో ముదునూరి వెంకటరాజు పాల్గొన్నారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చక్రధరరావు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మోడరన్ అధినేత లయన్ జివి.రావు

జూనియర్ ఇంటర్‌లో

మోడరన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాలు శనివారం ప్రకటించారు. ఈ ఫలితాల్లో రామచంద్రపురం మోడరన్ జిఆర్‌సి జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయి అత్యుత్తమ రికార్డు స్థాయి ఫలితాలు సాధించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీసీ గ్రూపు నందు 470 మార్కులకు పివివిఎస్ఎస్ఎస్.సంజన 466 మార్కులు సాధించిందని, పూజిత 465, సిహెచ్.భవ్య శ్రీ 465, ఎ.మనోజ్ 465, ఎం.మౌనిక 465, ఎ. తరుణ్ 465, కె.జిష్ణు 464, బి.సంధ్య 464, టి.రమ్యశ్రీ 464, ఎన్.తనూజ 464, బి.సాయి శ్రీకర్ 464, ఆకుల సాయి సుజి 463, కె.హారిక 463, డి.జయ చంద్రిక 463, జి.ఫణి శ్రీ 463, బి.శశిరేఖ 463, డి.భావన 463, ఎన్.కౌశిక్ 462, పి.ఝాన్సీ 461, జె.ముకుంద ప్రియ461, ఆర్.సత్యశ్రీ 461,వి. నిహాల్ 461,జి. గౌతమి 461,సి. హెచ్. శ్రీరామ్ 460,ఎం. శ్రీ వైష్ణవి 460 మార్కులతో 25 మంది 460 పైబడి మార్కులు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా బైపిసి నందు 440మార్కులకు కె.గీత శ్రీ 434, ఎ.ప్రసన్న 433, ఆశీరరావు 432, పి.వైష్ణవి 430 మార్కులు సాధించినట్లు వివరించారు. సిఇసి గ్రూపులో 500 మార్కులకు ఎం కామేశ్వరి 488, టి.భువనేశ్వరి 485, మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, మోడరన్ జూనియర్ కాలేజీ స్టాఫ్ అభినందించారు.


త్యాగానికి ప్రతీక బక్రీద్

ప్రజాశక్తి - యంత్రాంగం

త్యాగానికి ప్రతీక బక్రీద్ అని పలువురు ప్రముఖులు అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముస్లింలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రపురం: బక్రీద్ సందర్భంగా ముస్లింలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ శుభాకాంక్షలు తెలిపారు.. ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ, ఇతరుల పట్ల దయ, కరుణ కలిగి ఉండాలనీ. ఈ పండుగ మీ ఇంట్లో ఆనందాన్ని తీసుకురావాలని ఆశిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ముస్లింలకు బక్రీద్ పర్వదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు వైసిపి యువజన విభాగం నాయకులు, రామచంద్రపురం ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. **ముమ్మిడివరం:** ముస్లింల త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ ఇస్లాంలో గొప్ప పండుగ అని మౌలానా మీర్జా అక్బర్ షా పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ముస్లిం వీధిలోని మజ్జిదే జహెరాలో శనివారం ఈద్-ఉల్-ఆదా (బక్రీద్) ప్రత్యేక నమాజు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఈద్ - ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు, మహిళలు పాల్గొన్నారు. **రాజోలు:** మానవాళిని జాగత పరిచి మనలో త్యాగనిరతి చాటిచెప్పే ముస్లింల రెండవ అతి పెద్ద పవిత్రమైన పండుగ బక్రీద్ అని జామియా మసీదు అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ అలీ(మున్నా) అన్నారు. శనివారం రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈకార్యక్రమంలో జామియా మసీదు సభ్యులు షేక్ బాజీ, షేక్ ఇస్మాయిల్,షేక్ మీరా లాల్,షేక్ వలీ, షాబుద్దీన్, మొల్లా ఇక్బాల్, మొల్లా సర్దార్, రెహ్మాన్, రబ్బానీ, షాన్ తదితరులు పాల్గొన్నారు.


రాజోలులో ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్న ముస్లింలు


విరాళాలు అందిస్తున్న టిడిపి కో కన్వీనర్ డివివి

సేవా కార్యక్రమాలతో దాసరి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మాజీ ఎంపిపి, పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ శనివారం పలు సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొండవరంలో రామాలయం నిర్మాణానికి రూ.50,001, కిడ్నీ డయాలసిస్ పేషెంట్ టీడీపీ సీనియర్ కార్యకర్త గూడల మధుబాబు వైద్య నిమిత్తం రూ.10,000, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు రూ.5,116, అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి అన్నదాన ట్రస్టుకు రూ.5,116 విరాళాలు అందజేశారు. సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతృప్తి కరంగా ఉందని డివివి సత్యనారాయణ పేర్కొన్నారు. పలువురు కూటమి నాయకులు టిడిపి దాసరిని పుల్లేటికుర్రు లో ఆయన స్వగ్రామం లో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాలలో చోటు సంపాదించుకోవాలని అభిలాషించారు.

నేడు ప్రత్యేక యోగా ప్రదర్శనలు

ప్రజాశక్తి - అమలాపురం

పభుత్వం 'యోగాంధ్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా పై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ యోగా అవగాహన కార్యక్రమాలలో భాగం గా జిల్లాలో సీనియర్ పౌరులతో ప్రత్యేక థీమాటిక్ యోగా శిబిరాలు నిరహించాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఆదివారం ఉదయం 7 నుంచి 8గంటల వరకు మూడు ప్రధాన డివిజనల్ కేంద్రాల్లో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అమలాపురం డివిజన్ కి సంబంధించి అమలాపురంలోని మెట్ల సత్య నారాయణ పార్క్ నందు, కొత్తపేట డివి జన్‌కి సంబంధించి కొత్తపేట ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో, రామచంద్రపురం డివిజన్ కి సంబంధించి రామచంద్రపురం లోని కృత్తి వెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ కళాశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. యోగా ప్రదర్శనలు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో, ఆయా డివిజన్లలో ఉన్న స్థానిక సీనియర్ సిటిజన్ల భాగస్వా మ్యంతో నిర్వహించనున్నారు. వయో వృద్ధులంతా యోగా కార్యక్రమాలలో పాల్గొని విజయ వంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం రావి చెట్టు సెంటర్లో ఒక భవనంలో శనివారం పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్చార్జి ఎస్ఐ ఎం.అశోక్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ.3,400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పాము కాటుకు గురైన కూలీ మృతి

ప్రజాశక్తి - కాజులూరు

పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి చెందారు. ఎస్ఐ వెంకటలక్ష్మి చెప్పిన వివరాల ప్రకారం శనివారం ఉదయం పంట కాలువ వద్ద ఉపాధి పనులు చేస్తుండగా పాలిక నాగేశ్వరరావు (75)ను తాచుపాము కరిచింది. సమీపంలో ఉన్న యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందారని తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని ఎస్ఐ వెంకటలక్ష్మి, సర్పంచ్ చెరుకూరి వెంకట సత్యనారాయణ రాజు పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్పై దాడి

ప్రజాశక్తి - కొవ్వూరు

మావడపల్లి గ్రామంలో టాటా క్యాపిటల్ లిమిటెడ్ మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ కె.తరుణ్కుమార్పై గెల్లా సతీష్ అనే వ్యక్తి దాడికి దిగాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాయిదాల వసూళ్ల నిమిత్తం తరుణ్కుమార్ మావడపల్లిలో కస్టమర్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో కస్టమర్ పక్కింట్లో ఉంటున్న గెల్లా సతీష్ కలుగజేసుకుని నువ్వు ఏజెంట్ అనడానికి ఆధారాలు ఏవీ అంటూ ప్రశ్నించాడు. అంతేకాక సెల్ ఫోన్ లాక్కుని తరుణ్ కుమార్ తలపై కొట్టాడు. దీంతో తరుణ్కుమార్ తలకు గాయమైంది. తనను దుర్భాషలాడి కొట్టినట్లు పట్టణ పోలీసులకు తరుణ్కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని హెచ్సి లలిత తెలిపారు.

కూటమి హామీలకు ఏడాది

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ఏడాది పూర్తయినా ఆచరణలో అమలుకు నోచుకోలేదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. తాజాగా కోనసీమ జిల్లాలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన విషయం విదితమే. అయితే ఈ నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేస్తామంటూ ఇచ్చిన హామీ కూడా అమలవ్వ తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయినా ఓ వైపు హామీలు అమలుకు నోచుకోకపోవడం, మరోవైపు పెరుగుతున్న ధరలు అదుపులో లేకపోవడం వంటి పరిణామాలు ప్రజలలో పాటు కూటమి నేతల్లోనూ ఆందోళన నెలకొంటోంది. మరోవైపు పులిపై పుట్రలా కూటమి నేతల్లో పదవుల పంపకాలలో అసంతృప్తి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంది. తాజాగా జరిగిన మహానాడు అసంతృప్తులకు వేదికగా మారింది. మరోవైపు రాష్ట్ర స్థాయి మహానాడుకు ఉమ్మడి జిల్లాలోని అతి స్వల్పంగా కార్యకర్తలు తరలి వెళ్లారనే గుసగుసలు అధికార పార్టీ ముఖ్య నేతల్లో ఇప్పటికే మొదలైంది. తాజాగా సీతానగరంలో ఇద్దరు ద్వితీయ శ్రేణి నాయకులు పదవులకు రాజీనామా చేసి అసంతృప్తిని వెళ్ల గక్కారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలు తలకిందులయ్యే పరిస్థితి భయమనే ఆందోళన ఆ పార్టీలో నెలకొంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుతో పెరుగుతున్న ధరలు, పన్నుల భారాలకు కళ్లెం వేయకపోతే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకోక తప్పదని తాజా పరిణామాలు మరోసారి హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ప్రభుత్వం ఏ మేరకు ఆత్మవిమర్శ చేసుకుని తిరిగి ప్రజాభిమానం చూరగొంటుందో వేచి చూడాలి మరి.

కారెత్తిస్తున్న ఎండలు

భానుని ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తె ప్రభావంతో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచే ఎండలు దారెత్తిస్తున్నాయి. జిల్లాలో సరాసరి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరాయి. దీంతో మధ్యాహ్నం ప్రజలు బయటకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన కూడళ్లు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వేసవి తాపం నుంచి సేదతీరేందుకు ప్రజలు కొబ్బరి బొండాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. అయితే చలివేంద్రాలు ఏర్పాటు చేయటంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు వెనుకపడ్డాయి. దీంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ సైతం అప్రమత్తత లేకపోవటంతో అక్కడక్కడా వడదెబ్బ మృతులు నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి ప్రజారోగ్యం కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలి.

విద్యావేత్త చిరంజీవినికుమారి అస్తమయం

ప్రముఖ విద్యావేత్త, ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినికుమారి ఈ నెల 1న తుది శ్వాస విడిచారు. సాహితీ వేత్తగా, సామాజిక వేత్తగా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా ఆమె తెలుగు ప్రజలకు సుపరిచితులు. రచయితగానూ ఆమె రాణించారు. ఆంగ్ల అధ్యాపకురాలిగా ఆమె ప్రయాణం మొదలు పెట్టారు. ఎంఎ పట్టా అందుకున్న తరువాత రంగరాయ మెడికల్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్గా పనిచేశారు. 1970లో ఐడియల్ జూనియర్ కాలేజీని స్థాపించారు. అదే ఒరవడిలో 1974లో డిగ్రీ కాలేజీని ప్రారంభించారు. 1980 ప్రాంతంలో వీటికి ప్రభుత్వ ఎయిడెడ్ను కూడా సాధించారు. కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాక అభ్యుదయ కార్యక్రమాలను నిర్వహించారు. 1980లో ఆల్ ఇండియా పీస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇదే కళాశాలలో మహాకవి శ్రీశ్రీ సప్తపతి ఉత్సవాలు కూడా జరిపారు. ఇస్కస్ తరఫున భారతదేశ నుంచి 1970లో సోవియట్ యూనియన్ వెళ్లే అవకాశం వచ్చింది. ఈ బందానికి చిరంజీవిని కుమారి లీడర్గా వ్యవహరించారు. ఆర్మీనియాలో మాన్యా అనే రచయితతో అక్కడ పరిచయం ఏర్పడింది. ఆయన కథల పుస్తకం ఆమెతో పాటు తెచ్చుకుని ఇండియాకి వచ్చిన తర్వాత వాటిని ఆర్మేనియా కథలు పేరిట అనువదించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆవిర్భావ నుంచి ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారు. అరసం కార్యకలాపాలు తగ్గిన తర్వాత అదే బావ సారూప్యత కలిగిన వారితో కాకినాడలో తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేయడానికి కృషి చేశారు. భారత జ్ఞాన విజ్ఞాన సమితి జిల్లా శాఖ అధ్యక్షురాలుగా, ఏపీ ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షురాలుగా, ఆంధ్రా యూనివర్సిటీ కళాశాల యాజమాన్య సంఘం అధ్యక్షురాలుగా, జిల్లా సాక్షరతా సమితి సభ్యురాలుగా, గిరిజన ప్రాంత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శిగా, ఇండియన్ సొసైటీ ఫర్ సోషల్ డైనమిక్స్ అధ్యక్షురాలుగా, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలుగా ఇలా పలు సంస్థలలో ఆమె బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించారు.

గోదారి గలగలలు

పనిగంటల పెంపుపై కార్మికుల భగ్గు

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పలకడంపై కార్మికులు, కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. తాజాగా 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంపద్ధ సృష్టించేది పారిశ్రామిక వేత్తలేనంటూ వక్రభాష్యం చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులపై పని భారం మోపడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బహిరంగ ఇసుక రీచ్లలో ప్రత్యక్ష విక్రయాలు నిలుపుదల

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో 20 ఇసుక రీచ్ లలో రుతుపవనాలు సమీపిస్తున్నందున ఈ నెల ఎనిమిదో తేదీ నుండి బహిరంగ ఇసుక రీచులలో ప్రత్యక్ష విక్రయాలు నిలుపుదల చేసి స్టాక్ యార్డుల ద్వారా విక్రయానికి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ వినియోగదారులు ఈ యొక్క విషయాన్ని గమనించి ఇకపై స్టాక్ యార్డుల ద్వారా ఇసుకను కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో రావులపాలెం, గోపాలపురం, జొన్నాడ, తాతపూడి, అమలాపురం ,ఊబలంక 1,2, వద్దిపర్రు 1,2 రీచులు పొడగట్లపల్లి 1,2, కపిలేశ్వరపురం, ఆలమూరు, పులిదిండి, ఆత్రేయ పురం, అంకంపాలెం, నార్కెడమిల్లి తదితర రీచులలో ఈ నెల ఎనిమిదో తేదీ నుండి బహిరంగ ప్రత్యక్ష ఇసుక విక్రయాలు నిలుపుదల చేసి స్టాక్ యార్డుల ద్వారా తరలించేందుకు జిల్లా భూగర్భ గనుల శాఖ ఆధ్వర్యంలోచర్యలు తీసుకున్నట్లు ఆయన తెలి పారు. ఈ 20 బహిరంగ రీచ్లకు వెళ్లే మార్గాలలో ట్రెంచులు తవ్వి నిషేధపు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

అన్నపూర్ణ డే కేర్ హోం ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలం లోని ర్యాలి గ్రామంలో శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనూస్ స్వచ్ఛంద సంస్థ శనివారం నూతనంగా అన్నపూర్ణ డే కేర్ హోం ఫర్ ఏజ్డ్ ను ప్రారంభించింది. దీని ద్వారా వృద్ధులకు వైద్య సేవలు, భోజన సదుపాయం, ఆటలు పాటలు వంటి ఉచిత సేవలను అందించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీత లు తెలియజేశారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది వృద్ధులకు ఉచిత అధునాతన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బర్లంక ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ తేజశ్రీ శ్యామ్ జాదూగర్ అన్నపూర్ణ రుషిత్ తదితరులు పాల్గొన్నారు.

పల్లా సింహాచలం మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కొత్తపేట

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎంఎల్ఎ పల్లా సింహాచలం మృతి పార్టీకి తీరని లోటని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1994-1999 మధ్య ఎంఎల్ఎగా పల్లా సింహాచలంలో కలసి పనిచేశామన్నారు. సింహాచలం భూ ఆక్రమణలు సంబంధించి వేసిన విచారణ కమిటీలో తామిద్దరూ సభ్యులుగా కలిసి పనిచేసిన వైనాన్ని సత్యానందరావు గుర్తు చేసుకున్నారు. విశాఖ అభివృద్ధికి సింహాచలం చేసిన కృషి ఎనలేనిదన్నారు. పల్లా శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

ట్రాఫిక్ నిబంధనల పాటనతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించాలని డిఎస్పి శ్రీహరి రాజు సూచించారు. శనివారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల యూనిఫామ్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటో డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్లు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులకు మరింత నమ్మకంగా సేవలందించాలని తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతతో పాటు రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్కు ఆటంకం కలగకుండా నడవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎ.కృష్ణ భగవాన్, క్రైమ్ సిఐ అంకబాబు, ట్రాఫిక్ సిబ్బంది సన్యాసిరావు, శ్రీను, ఈశ్వరరావు, సత్యనారాయణ, సరోజిని పాల్గొన్నారు. పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, వేట్లపాలెం, ద్వారపూడి, ఉండూరుకు చెందిన సుమారు 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫామ్లు పంపిణీ చేశారు.



రాష్ట్ర శెట్టిబలిజ డైరెక్టర్ పెదబాబు పుట్టినరోజు వేడుకల్లో కూటమి శ్రేణులు

శెట్టిబలిజ రాష్ట్ర డైరెక్టర్ పెదబాబుకు ఘన సత్కారం

ఘనంగా పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మాజీ జడ్పిటిసి సభ్యుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు (పెదబాబు) పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర సహకార యూనియన్ మాజీ డైరెక్టర్ గణపతి వీర రఘువులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పెదబాబును శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ కూటమి నాయకులు కేకు కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, రాష్ట్ర టిడిపి హెచ్ఆర్డి సభ్యులు దళితరత్న నేదునూరి వీర్రాజు, దొమ్మేటి శ్యామ్, పెంద్రా రమేష్, నక్క సునీల్ రాజు, మట్టపర్తి చంద్రశేఖర్, మందా రాజేష్, నియోజకవర్గ కూటమి శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.



మామిడికుదురులో వెలుగు ఆధ్వర్యంలో మహిళలకు యోగాసనాలు

యోగాతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - యంత్రాంగం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలువురు అన్నారు. జిల్లాలో శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొని యోగసనాలు వేశారు.

మామిడికుదురు: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి.మల్లిక అధ్యక్షతన మెగా యోగసనాలు సదస్సు నిర్వహించారు. యోగా కార్యక్రమానికి వెలుగు మహిళా సమాఖ్య ఎపి ఎం వరాలబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆకుల ఉమామహేశ్వర రావు, కోట బ్రహ్మ నందం, గణపతుల లీల కనక మహాలక్ష్మిలు యోగా టీచర్లుగా యోగా మహిళా సభ్యులకు, పురుషులకు యోగా చేయించారు. కార్యక్రమంలో మెండ ఆదినారాయణ, మండల సమాఖ్య కార్యదర్శి బి.శ్రీ తులసి దేవి, సిసి ఆనంద్, అకౌంటెంట్ కె.నాగార్జున, విఒఎలు, మహిళా సభ్యులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు. **అయినవిల్లి:** మండలంలోని వైవిఎస్ బిఆర్ఎం పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్ నందు స్వయం సహాయక సంఘాల సభ్యులకు మండల మహిళా సమాఖ్య, వెలుగు ఆధ్వర్యంలో యోగ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ జి.సరోవరరావు కార్యక్రమంలో ఎపిఎం ఎం.వెంకటేశ్వరరావు, అకౌంటెంట్ భవాని, విఒఎలు నాగమణి, నాగలక్ష్మి, నాగదుర్గ, ధనలక్ష్మి, భారతి, మల్లేశ్వరి, దుర్గ, అన్నపూర్ణ, జ్ఞానేశ్వరి, వెంకటేశ్వరరావు, . డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** అ మండల సమాఖ్య కార్యాలయం లో మండల మహిళా సమాఖ్య సభ్యులు అధ్యక్షతన యోగసనాల సదస్సు నిర్వహించారు. యోగాంధ్ర- 2025లో భాగంగా యోగ గురువు డాక్టర్ దుర్గా ప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి వెలుగు ఎపిఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో అమలాపురం మండల మహిళా సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ , ఆయుష్ మెడికల్ ఆఫీసర్ శ్యాంసుందర్, సిసిలు విఒఎలు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** యోగా మండల పరిధి 18 గ్రామాల్లో వెలుగు ఆధ్వర్యంలో యోగాంధ్ర- 2025లో భాగంగా ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద మెగా యోగసనాల సదస్సులు శనివారం ఏపీఎం సుడిగాలి పర్యటనలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు కొత్తపల్లి ధనలక్ష్మి, అకౌంటెంట్ కుమార్, విఒఎలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, డ్వాక్రా సభ్యులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అయినవిల్లి తహశీల్దార్పై దాడికి ఖండన

ప్రజాశక్తి - రామచంద్రపురం

అయినవిల్లి తహశీల్దార్ నాగలక్ష్మమ్మ పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తునామ న్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులపై దాడులు కొనసాగుతు న్నాయని, దాడులు చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి ప్రభుత్వాలు శిక్షించక పోకపోవడం వలనే అయినవిల్లి తహశీల్దార్పై దాడి వంటివి పునరావృతం అవుతున్నాయని భావిస్తున్నామ న్నారు. ఇటు వంటి దాడులకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని రెవెన్యూ ఉద్యోగులకు మద్దాలబాపూజీ పిలుపు నిచ్చారు.

ఘనంగా రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో బ్రహ్మపురి గ్రామంలో నిర్మించిన శ్రీ సీతారామ ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలోనూ ఆమె పాల్గొ న్నారు. గ్రామాల్లో ఆలయాలు ఉండటంవల్ల ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయని, ఆలయ నిర్మాణానికి కృషి చేసిన గ్రామస్తులకు ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలదుర్గకు అభినందన

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం అమూజూరు మెయిన్ పాఠశాల విద్యార్థిని జంజం బాలదుర్గ ఎపి రెసిడెన్షియల్ స్కూల్లో 5 వ తరగతి ప్రవేశపరిక్షలో ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు విద్యార్థిని తుని స్కూల్ నందు సీట్ సాధించిందని ఎంఇఒ అలజంగి నాగరాజు తెలిపారు. బాల దుర్గను ఎంఇఒ, ఎంఇఒ-2 ఆంజనేయులు, హెచ్ఎం చొల్లంగి శ్రీను తదితరులు శనివారం అభినందించారు.



స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం లో వేద సద స్యం నిర్వహిస్తున్న పండితులు

అప్పనపల్లిలో వేద సదస్యం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి తిరు కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నార. ఈ కార్యక్రమాల్లో భాగంలో మూడవరోజు శనివారము ఉభయ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది వేదపండితుల ఆధ్వర్యంలో చతుర్వేద మహా దాశ్వీరవచనంలో భాగముగా వేద సదస్యం కార్యక్రమం నిర్వహించారు. అప్పనపల్లికి చెందిన శ్రీ శేష శారద భక్త బృందం ఆలపించిన పురందరదాసు కీర్తనలు, మానేపల్లి కి చెందిన కాజులూరి మహేంద్ర కుమార్ బృందము, శ్రీ సీతారామ బాలభక్త బృందం కళాకారులు తమదైన శైలిలో ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు ఆలయ సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలోఉత్సవ కమిటి సభ్యులు, యాత్రికులు పాల్గొన్నారు

బాలాబాలాజీ స్వామి ఆదాయం రూ.4.16 లక్షలు

బాల బాలాజీ స్వామి దేవస్థానమునకు వివిధ విభాగాల ద్వారా శనివారం రూ.4,16,615 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు ఇందులో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్కు రూ.10వేలు, నిత్యాన్నదాన ట్రస్ట్కు రూ.86,273 ఆదాయం సమకూరిందన్నారు. 5,800 మంది యాత్రికులు స్వామి వారిని దర్శనం చేసుకోగా 3,500 మంది యాత్రికులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

మందేశ్వర స్వామి ఆదాయం రూ.2.13 లక్షలు

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో ఉన్న మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనివారం అత్యధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తైలాభిషేకములు ద్వారా రూ.1,69,945, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.43,661 మొత్తం వెరసి రూ.2,13,606 ఆదాయం వచ్చింది. డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర రావు తెలిపారు.

అయినవిల్లిలో నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేత

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని శనివారం హైదరాబాద్కు చెందిన అడుసుముల్లి వెంకట సత్య సుబ్రహ్మణ్యం ప్రసాద్ కుటుంబ సభ్యులు దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్య అన్నదాన నిధికి రూ.10,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సత్యనారాయణ రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటమును బహూకరించారు.

వృద్ధులకు రేషన్ పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం

యర్రమిల్లి వారి వీధి రేషన్ షాప్ ను జనసేన పార్టీ సీనియర్ నాయకులు గండి స్వామి సందర్శించారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి వృద్ధులకు, వికలాంగులకు ఇంటికి తీసుకెళ్ళి ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన సూచనలు తప్పనిసరిగా పాటిస్తున్నారా లేదా అంటూ డీలర్ ను ప్రశ్నించారు.. అందరికి దాదాపు అందాయని, రేషన్ దారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు.

అమరావతిపై వైసిపి నేతల దుష్ప్రచారం

ప్రజాశక్తి - ఆలమూరు

అమరావతి ప్రాంతంపై మితిమీరిన విద్వేషంతో వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని టిడిపి మహిళా సీనియర్ నేత, మాజీ జడ్పిటిసి సభ్యులు దండంగి మమత అన్నారు. శనివారం ఆమె చింతలూరులో తన స్వగృహంలో మాట్లాడు తూ ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా వైసిపి నాయకులకు వారికి బుద్ధి రాలేదన్నారు. 2014లో అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఒప్పుకొని, 2019లో అక్కడే గృహాన్ని నిర్మించుకుంటున్నానని, రాజధాని మార్చే అవకాశం లేదని రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి ఎన్నికలకు వెళ్లి, ఆ తరువాత ప్రజలను మోసం చేసి మూడు రాజధానులు అంటూ ఐదేళ్ల కాలాన్ని వధా చేసిన వైఎస్.జగన్ ఇంకా ఆ పంథా వీడలేదన్నారు. జగన్ ఇంటితో పాటు రాష్ట్రంలో ప్రముఖ నాయకుల గృహాలన్నీ అమరావతి ప్రాంతంలోనే ఉన్నాయని గుర్తుపెట్టుకోవాలన్నారు.